క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

దహెగాం: మండల కేంద్రానికి చెందిన భీమ నాథుల జగదీశ్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్ లో మండల కేంద్రానికి చెందిన స్నేహశీల యూత్ జట్టు, కల్వాడ జట్టు తలపడగా స్నేహ శీల యూత్ విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ. 25,000 ద్వితీయ బహుమతి కల్వాడ జట్టుకు రూ.11,000 అందించారు. కార్యక్రమంలో జగదీశ్ కుటుంబ సభ్యులు, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గుర్తింపు సర్వే



సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారులు

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామపంచాయతీల్లో ఈ నెల 24 వరకు ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే చేపట్టనున్నట్లు డాక్టర్ అజీమొద్దీన్ అన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 29 బృందాలు ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సంతోష్, ఆశా వర్కర్ శ్రీలత, సూపర్‌వైజర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: పదో తరగతి వార్షిక పరీక్షలను విద్యార్థులు భయం వీడి రాస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఎస్సై మధుకర్ అన్నారు. శుక్రవారం పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా కౌటాల, ముత్తంపేట్ జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 250 మంది విద్యార్థులకు ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఎంఈవో సోమయ్య, హెచ్ఎంలు నారాయణ్‌సింగ్, హన్మంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిలిండర్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం వినియోగదారులకు శ్రీ బాలాజీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సిలిండర్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సిలిండర్, రెగ్యులేటర్, స్టౌవ్ వినియోగించే విధానంపై వివరించారు. గ్యాస్ పొదుపు చేసే పద్ధతులు తెలియజేశారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి

ఇచ్చోడ: పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఇచ్చోడ మేజార్ పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉదయం పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతీరోజు ఇచ్చోడ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం నిరంతరం నిర్వహించాలన్నారు. రోడ్లపై చెత్త వేసే దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీవో సాయిప్రసాద్, తదితరులు ఉన్నారు.

భూమిపూజ

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.3 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణానికి దేవుల నాయక్ ఎంపీటీసీ సునీత రోహిదాస్ శుక్రవారం భూమిపూజ చేశారు. నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీపీ తుల శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీ టికెట్ ‘సోయం’కే ఇవ్వాలి

ఇచ్చోడ: ఆదిలాబాద్ బీజేపీ పార్లమెంట్ టికెట్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకే ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సోయంకు టికెట్ ఇవ్వకపోతే తుడుందెబ్బ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెబుతాన్నారు.

నిరుపయోగంగా చెక్‌పోస్టు భవనం

- రూ. లక్షలు వెచ్చించి నిర్మాణం
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- ఆకతాయిలకు అడ్డాగా భవనం

కెరమెరి: లక్షల రూపాయల ప్రజాధనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా వృథాగా మారింది. మండలంలోని కేస్లాగూడ గ్రామ సమీపంలో ఎనిమిదేళ్ల క్రితం రూ.2 లక్షలతో మార్కెట్ చెక్‌పోస్టు నిర్మించారు. నిర్మించడమే తమ వంతు అనుకున్న అధికారులు తర్వాత దానిని వినియోగంలోకి తీసుకురావడం మరిచిపోయారు. నిర్మాణం కంటే ముందు హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత అసలు దాని గురించి పట్టించుకోవడమే మరిచిపోయారు.

ఆకతాయిలకు అడ్డాగా..

రూ. 2 లక్షలు వెచ్చించి నిర్మించిన చెక్‌పోస్టు భవనం ప్రస్తుతం ఆకతాయిలకు అడ్డాగా మారింది. ప్రతీరోజు రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు అందులో సాగిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామానికి కొంత దూరంలో భవనం ఉండడంతో అటువైపు వెళ్లేవారు లేక ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. భవనంలోనే మద్యం తాగుతున్నారు. భవనంలో తలుపులు, కిటికీలు బాగానే ఉన్నా రెండో గదిలో పైకప్పు రేకులు పగిలిపోయాయి. కింది భాగం పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ఇప్పటి వరకు ఏ అధికారి కూడా భవనం వైపు వెళ్లలేదు. ఏళ్లు గడుస్తున్నా భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



నిరుపయోగంగా మారిన చెక్‌పోస్ట్ భవనం



ఆకతాయిలు పగులగొట్టిన మద్యం సీసాలు



పగిలిన పైకప్పు

ఈ రోడ్డు వైపునకు పెద్దగా వాహనాల రాకపోకలు ఉండవు. కేవలం పత్తి సీజన్‌లో మాత్రమే పత్తి లోడ్‌తో వాహనాలు తరుచుగా ఆదిలాబాద్‌కు వెళ్తుంటాయి. అయినా ఇక్కడ లక్షలు పెట్టి మార్కెట్ చెక్‌పోస్టు భవనం నిర్మించడంతో ఆంతర్యం ఏమిటన్నది అంతు చిక్కడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేతనాల వెతలు!

- ఆర్థిక ఇబ్బందుల్లో ‘ఉపాధి’ సిబ్బంది
- మూడు నెలలుగా అందని వేతనాలు

జిల్లాలోని ‘ఉపాధి’ సిబ్బంది	
ఏపీవోలు	13
ఈసీలు	07
సాంకేతిక సహాయకులు	78
కంప్యూటర్ ఆపరేటర్‌లు	36
క్షేత్ర సహాయకులు	165

జైనూర్: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చింది. వేసవిలో ఎంతోమంది గ్రామీణులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అయితే ఉపాధిహామీ పథకంలో భాగంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మాత్రం వేతనాలు అందక తిప్పలు పడుతున్నారు. గత మూడు నెలలుగా జీతాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

గత డిసెంబర్ నుంచి..

ఉపాధిహామీ సిబ్బందికి గత డిసెంబర్ నుంచి వేతనాలు అందడం లేదు. గతంలో ప్రతీ నెల 10వ తేదీలోపు ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమయ్యేవి. కానీ గత మూడు నెలలుగా సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల స్కూలు ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని వారు వాపోతున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టే ప్రతీ పనిలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, ఏపీవో, ఇంజనీరు, కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తుంటారు. కాగా వీరితో పాటు కార్యాలయ పనుల నిమిత్తం మండల పరిషత్ అటెండర్‌లకు సైతం వేతనాలను ప్రభుత్వం చెల్లించడం లేదు. గతేడాది డిసెంబర్ నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 300 మంది ఉపాధి ఉద్యోగుల వేతనాలు విడుదల కాలేదని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టి ఉపాధి హామీ సిబ్బందికి వెంటనే వేతనాలు అందేలా కృషి చేయాలని వారు కోరుతున్నారు.



జామిని చెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఉపాధిహామీలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు అందని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సిబ్బంది ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉద్యోగులకు త్వరలో జీతాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

\- సురేందర్, డీఆర్‌డీవో

అలరించిన ‘వీడ్కోలు’ సంబురాలు

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాలు ఘనంగా నిర్వహించారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని హెచ్ఎం గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తంపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పది విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఆర్పీ ప్రకాశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిర్యాణి: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని ఎంఈవో వేంకటేశ్వర స్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, ఉపాధ్యాయులు అమరేందర్, శ్రీనివాస్, దత్తుమూర్తి, మంజుల, శ్రీధర్ ఉన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ 45వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి బీజేపీ నాయకురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ శిశుమందిరాలు సంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, యోగ్ చాప్, యోగా, డంబుల్స్, ఏకపాత్రాభినయం, నాటికలు, సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల గ్రూప్ 4 పరీక్షలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థి శ్రీరాం శివకృష్ణను సన్మానించారు. సీఐ రమేశ్, పాఠశాల కార్యదర్శి వేణుగోపాల్, సహకార్యదర్శి మధూకర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మహేశ్, విశాల్, ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: బూర్గుడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సదాశివ్, దుర్గాప్రసాద్, సంతోష్, రామకృష్ణ, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, తదితరులు ఉన్నారు.



ఆసిఫాబాద్: శిశుమందిర్‌లో సాంస్కృతిక నృత్యం చేస్తున్న విద్యార్థులు



దహెగాం: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కౌటాల: టీచర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

బెజ్జూర్: పశుపోషకులు, రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని బెజ్జూర్ ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన జావిద్ అలీ ఖాన్ అన్నారు. పశువైద్య సహాయకులు జితేందర్‌తో కలిసి శుక్రవారం మండల కేంద్రంలోని గోల్కొండ వీధిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య సహాయకులు జితేందర్ మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి పశువులను కాపాడుకునేందుకు జిల్లా పశువైద్యాధికారి ఆదేశాల మేరకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర మనోహర్, మాజీ సర్పంచ్ పెద్దల సుగుణ, మాజీ వార్డు సభ్యులు పెద్దల లలిత, నాయకులు జావిద్, పెద్దల శంకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యుడు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని కన్నెపెల్లి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 251 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వైద్యుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, పశు వైద్య సిబ్బంది ఉన్నారు.



బెజ్జూర్: టీకా వేస్తున్న ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

రెబ్బెన: మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి అనసూయ(సీతక్క) సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండల కేంద్రానికి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు జాకీర్ ఉస్మానీ తన అనుచర వర్గంతో కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు, నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్, మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, ప్రధాన కార్యదర్శి, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, నాయకులు చిరంజీవిగౌడ్, గోగర్ల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న జాకీర్‌ఉస్మానీ

బదిలీపై వెళ్తున్న సివిల్ డీజీఎంకు సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సివిల్ డీజీఎంగా విధులు నిర్వహించి బదిలీపై కార్పొరేట్ సివిల్ జీఎం కార్యాలయానికి వెళ్తున్న ఆర్.సతీశ్‌బాబును శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్ సన్మానించారు. ఏరియాలోని సివిల్ కాంట్రాక్టర్లతో కలిసి డీజీఎంను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఏరియాకు సతీశ్‌బాబు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈఈ రాజేంద్రప్రసాద్, కాంట్రాక్టర్లు, గోపికృష్ణారెడ్డి, హైడిదర్, మహిదర్, మురళీ, రాజు, తిరుపతి, మధూకర్ తదితరులు పాల్గొన్నారు.



సతీశ్‌బాబును సన్మానిస్తున్న జీఎం రవి ప్రసాద్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఆసిఫాబాద్‌రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోంబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని వట్టివాగు, పాడిబండ అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత ఉండే గర్భిణులు అధిక పోషకాలు ఉండే రాగులు, సామలు, సజ్జలు, కొర్రలు, అరికెలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, పార్వతి, నిర్మల, శ్రావణి పాల్గొన్నారు.

ఘనంగా పోషణ పక్షం వేడుకలు

రెబ్బెన: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం గంగాపూర్ సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది పోషణ పక్షం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు, కూరగాయలతో ప్రదర్శన నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరు చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. ఎంపీటీసీ హరిత, సూపర్‌వైజర్ విజయ తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ సౌందర్య

అసంపూర్తిగా స్త్రీశక్తి భవనం

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని వైనం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా స్త్రీశక్తి భవనం పూర్తి చేయకుండా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఐకేపీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న పురాతన భవనంలో ఎన్నో ఏళ్లుగా స్త్రీశక్తి భవనం కొనసాగుతుంది. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఏటా వర్షాకాలంలో పైకప్పు పెచ్చులు ఊడి పడుతుండడంతో తీవ్ర భయాందోళన మధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

2013లో నిధులు మంజూరు..

మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో మండల ఐకేపీ కార్యాలయం భవనం నిర్మాణానికి 2013లో రూ.27లక్షల నిధులు మంజూరయ్యాయి. నేటికీ భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఐకేపీ భవనం అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోగా సంబంధిత శాఖ అధికారులు పూర్తి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ అధికారులకు భవనాన్ని అప్పగించలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి స్త్రీశక్తి భవనాన్ని ఐకేపీ కార్యాలయానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.



సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం

ఇప్పటి వరకు అప్పగించలేదు

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న స్త్రీశక్తి భవనం ఐకేపీ కార్యాలయానికి సంబంధిత శాఖ అధికారులు అప్పగించలేదు. పురాతన భవనంలో ఏటా వర్షాకాలంలో విధులు నిర్వర్తించడం ఇబ్బందికరంగా మారింది. భవనం పూర్తి చేసి ఐకేపీ కార్యాలయానికి అప్పగించాలి.

\- దుర్గయ్య, ఏపీఎం, సిర్పూర్(టి)

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆదిలాబాద్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తాలూకా మున్నూరుకాపు సంఘ భవనంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలను శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ప్రతీఏటా నిర్వహించే బతుకమ్మ సంబురాలు, వినాయక నవరాత్రి వేడుకలు, దసరా ఉత్సవాలను విజయవంతం చేయడంలో మహిళా సభ్యుల కృషి ఎంతో ఉందన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు విఠల్, కౌన్సిలర్ సంద నర్సింగ్, ప్రభ, జోగు రమ, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.